అందరికీ ఆరోగ్యం.. సీఎం లక్ష్యం



45వ వార్డులో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు



దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న కె.కె.రాజు

- 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో పేదలకు ఎంతో మేలు
- 'ఉత్తర'లో 22,601 మందికి వైద్య సేవలు
- వైద్య శిబిరాలను విజిట్ చేసిన నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.కె.రాజు

సీతంపేట: ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలను రూపొందిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. నియోజకవర్గంలో సెప్టెంబరు 30 నుంచి నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు సోమవారంతో ముగిశాయి. వీటికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. బీపీ, సుగర్, థైరాయిడ్, దృష్టి లోపాలు, గుండె సమస్యలు, మహిళల ఆరోగ్య సమస్యలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి తగిన వైద్యం అందించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఐదు వారాల పాటు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో చాలా విలువైన సేవలు ప్రజలకు ఉచితంగా అందజేశారు. నియోజకవర్గంలోని ప్రతి సచివాలయం పరిధిలో జరిగిన వైద్య శిబిరాలను ప్రతి రోజూ కె.కె.రాజు సందర్శించారు. వైద్యులు అందిస్తున్న సేవలు, చేస్తున్న రక్త పరీక్షలు, రోగులకు ఇస్తున్న మందులను స్వయంగా పరిశీలించేవారు. అక్కడి వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా పలు సూచనలు ఇచ్చేవారు. శిబిరాలకు వచ్చిన వారితో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకునేవారు. సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న ఉచిత వైద్య సేవలపై ప్రజల స్పందన అడిగి తెలుసుకునేవారు. మొత్తంగా ఉత్తర నియోజకవర్గం ప్రజల నుంచి పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తమైంది. నియోజకవర్గంలోని మొత్తం 17 వార్డుల్లో 89 మెడికల్ క్యాంపులు జరిగాయని, మొత్తం 22,601 మంది ఉచితంగా వివిధ రకాల వైద్య సేవలు, పరీక్షలు పొందినట్టు సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు.

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. కప్పరాడలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో వారం రోజులుగా నిర్వహించిన వైద్య శిబిరంలో 6,600 మందికి పైగా రోగులు పలు రకాల వైద్య సేవలు పొందినట్లు ఆయన చెప్పారు. 47వ వార్డు కంచరపాలెం పరిధి పెదకొత్తూరు, రాంజీ ఎస్టేట్ సచివాలయానికి సంబంధించి కప్పరాడ యూపీహెచ్‌సీలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కొండవాలు ప్రాంతాల ప్రజలు అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య నిపుణులు పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ప్రజల చెంతకే వైద్య సేవలు తీసుకురావడంపై లబ్ధిదారులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. వైద్య పరీక్షలు చేయించుకున్నవారు సంతోషంగా ఇంటికి వెళ్లారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇటువంటి కార్యక్రమాలు చేపడితే రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా.. ఆనందంగా జీవిస్తారనే భరోసా కనిపిస్తోందన్నారు. వారం రోజులుగా సుమారు 6,682 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు కప్పరాడ యూపీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి సి.హరిష్మా చంద్ తెలిపారు.



కప్పరాడ యూపీహెచ్‌సీలో వైద్య శిబిరానికి హాజరైన స్థానికులు

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు 256 సచివాలయం పరిధి ప్రజలకు చేరువగా తాటిచెట్లపాలెం దరి వాసుదేవనగర్ కమ్యూనిటీ హాల్‌లో మూడు రోజులుగా నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారంతో ముగిసింది. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు శిబిరాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. సచివాలయ, వైద్య సిబ్బందితో మాట్లాడారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి ఆరోగ్య స్థితి గురించి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పేదల ఆరోగ్యం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి ముంగిటకే వైద్య సేవలు అందేలా చేస్తున్నారని హనోకు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప యాత్ర చరిత్రాత్మకం



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: ప్రజాసంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ జగనన్న చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర చరిత్రలో ఒక మైలురాయిగా అభివర్ణించారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా.. మ్యానిఫెస్టోను ఒక భగవద్గీత, బైబిల్, కురాన్‌లా భావించాలని పాదయాత్రలో ప్రజలు కష్టాలు నేరుగా తెలుసుకుని నవరత్నాలు పథకాలు రూపొందించినందుకు ప్రజలు 151 ఎమ్మెల్యే సీట్లు, 23 ఎంపీ సీట్లతో గెలిపించి అఖండమైన మెజార్టీని ఇచ్చారన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ముఖ్యమంత్రిని టీడీపీతో పాటు తోక పార్టీ, పచ్చమీడియా నోటికి వచ్చినట్లు విమర్శిస్తున్నారన్నారు. దీనిని సోషల్ మీడియా, మౌత్ పబ్లిసిటీ ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కటారి అనిల్‌కుమార్‌రాజు, సారిపల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, ఉషశ్రీ, వి.ప్రసాద్, బర్కత్ ఆలీ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, పార్టీ మండల అధ్యక్షులు, ఇన్‌చార్జులు జి.వి.రమణి, కృష్ణారావు మాష్టార్, జేసీఎ మండల కన్వీనర్లు బులుసు జగదీష్, నీలి రవి, వసంతల అప్పారావు, డైరెక్టర్లు ఎస్.రవికుమార్, పీలా వెంకటలక్ష్మి, పార్టీ శ్రేణులు, సీనియర్ నాయులు, అనుబంధ సంఘాల నాయకులు, అధ్యక్షులు ,సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 5 వినతులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులకు వినతులను అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 02, యూసీడీకి 01, పబ్లిక్ హెల్త్‌కు 01, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున అర్జీలు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. వీటి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1 టీఎస్ఎన్ రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, డీఈ భరణికుమార్, టౌన్ ప్లానింగ్ టీపీవో అసిస్టెంట్ అపరంజిత, ఎస్ఎస్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ పద్మావతి, వాటర్ వర్క్స్ ఏఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

క్లుప్తంగా

'స్పందన'కు 25 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 25 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డీటీ, ఆర్ఐ, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలకు రాట



ఉత్సవ రాట వేస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ, ముత్తయిదువులు

సీతంపేట: అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద గౌరీపరమేశ్వరుల 42వ వార్షికోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 11 నుంచి డిసెంబర్ 9 వరకు నెల రోజుల పాటు జరగనున్న గౌరీపరమేశ్వరుల మహోత్సవాలకు సోమవారం ఆలయం వద్ద రాట వేశారు. ముఖ్య అతిథి 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ముత్తయిదువులతో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. ఉత్సవ నిర్వాహకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

'నవంబర్ 10న సైన్స్ దినోత్సవం పాటించాలి'

సీతంపేట: నవంబర్ 10వ తేదీన ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని పాటించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని భారత నాస్తిక సమాజం కన్వీనర్ టి.శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో కోరారు. ప్రపంచ మంతట శాంతి, అభివృద్ధి కోసం సైన్స్‌ను ఆధారం చేసుకోవాలనే ఉద్దేశంతో ఐక్య రాజ్య సమితి యునెస్కో విభాగం నవంబర్ 10న సైన్స్ దినోత్సవంగా పాటించాలని పిలుపు ఇచ్చిందని గుర్తుచేశారు. భారత రాజ్యాంగం అధికరణ 51ఏ(హెచ్) శాస్త్రీయ విజ్ఞానాన్ని మానవతావాదాన్ని పెంపొందించడం ప్రతి పౌరుడి కర్తవ్యమని పేర్కొన్నదన్నారు. చెడుపు, చిల్లంగి, బాణామతి పేరుతో నేటికీ సమాజంలో దాడులు, హత్యలు జరుగుతున్నాయని తెలిపారు. నవంబర్ 10న పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మూఢ నమ్మకాల నిర్మూలనపై తరగతులు నిర్వహించాలని కోరారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

మర్రిపాలెం: ఓ వివాహిత ఇద్దరు పిల్లలను తీసుకుని అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. చోడవరంలో భర్త ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్న కాండ్రేగుల కుసుమ(28) భర్తతో గొడవపడి ఈ నెల 4న కంచరపాలెం తిక్కవానిపాలెంలో ఉంటున్న తన తల్లి దగ్గరికి కుమారుడు యెల్లాపు కుషంత్ కుమార్(5), కుమార్తె యెల్లాపు లాస్య(2)ను తీసుకుని వచ్చింది. 5వ తేదీ ఆదివారం ఉదయం కంచరపాలెం మెట్టు దగ్గన తన భర్త ఉన్నాడని, అతడితో కలిసి ఊరు వెళ్తున్నానని చెప్పి ఇద్దరు పిల్లలని తీసుకుని వెళ్లింది. భర్త తన దగ్గరకు రాలేదనడంతో తల్లి కాండ్రేగుల ఆదిలక్ష్మి సోమవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

బాక్సింగ్ పోటీల్లో బుల్లయ్య కాలేజీకి పతకాలు

సీతంపేట: ఇటీవల జరిగిన ఆంధ్రా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల బాక్సింగ్ పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ విద్యార్థులు ప్రతిభ చూపారు. 51 కిలోల విభాగంలో తరుణ్‌కుమార్, 60 కిలోల విభాగంలో దిగ్విజయ్, 63.5 కిలోల విభాగంలో క్రాంతికిరణ్, +92 కిలోల విభాగంలో దినేష్‌కుమార్‌రెడ్డి బంగారు పతకాలు సాధించారు. అజయ్ 48 కిలోల విభాగం, ఎండీ అస్లాం 71 కిలోల విభాగం, భార్గవ్ సురేష్ 75 కిలోల విభాగంలో రజత పతకాలు సాధించారు. జి.దినేష్ 92 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. పి.దిగ్విజయ్ బెస్ట్ బాక్సర్ అవార్డు అందుకున్నాడు. వీరిని సోమవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు.

కార్డ్ ప్రైమ్ 2.0తో రిజిస్ట్రేషన్లు సులభతరం



అక్కయ్యపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2.0 అమలును పరిశీలిస్తున్న డీఐజీ బాలకృష్ణ



మొదటి సారి 2.0లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తికి డాక్యుమెంట్ అందిస్తున్న సబ్ రిజిస్ట్రార్ డి.వి.నారాయణ

- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ బాలకృష్ణ

సీతంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 2.0 విధానంలో రిజిస్ట్రేషన్లు చాలా సులభతరమవుతాయని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ బాలకృష్ణ తెలిపారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ నూతన రిజిస్ట్రేషన్ విధానం కార్డ్ ప్రైమ్ 2.0ను అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. కార్యాలయంలో 2.0 అమలును ఆయన పరిశీలించారు. దీనిపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ కొత్త విధానంలో డాక్యుమెంట్ తయారీ, చలానా కట్టడం చాలా తక్కువ సమయంలో జరుగుతుందని, దీనివల్ల సులభంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. వినియోగదారులే స్వయంగా ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ తయారు చేసుకోవచ్చని చెప్పారు. ఆస్తి వివరాలు, పేరు, ఆధార్, సాక్షులు వంటి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తే సదరు ఆస్తి మార్కెట్ విలువ, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలు ఎంత కట్టాలో చూపిస్తుందన్నారు. కొత్త విధానంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ రిజిస్ట్రార్ గోపీచంద్, సబ్ రిజిస్ట్రార్ డి.వి.నారాయణ, డీఆర్ సృజన, సీనియర్ అసిస్టెంట్ సాయి లక్ష్మి పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు బీభత్సం



బీభత్సం సృష్టించిన కారు

సీతమ్మధార: తాటిచెట్లపాలెం జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ఒక వ్యక్తి మద్యం మత్తులో కారు నడిపి బీభత్సం సృష్టించాడు. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణహాని జరగలేదు. ఈ ఘటన వివరాలిలా.. ఏపీ39 ఎన్‌జే 3359 నంబర్ కారులో మద్యం తాగిన ఒక వ్యక్తి ఎన్ఏడీ నుంచి అక్కయ్యపాలెం వైపుగా జాతీయ రహదారిపై వస్తున్నాడు. సరిగ్గా తాటిచెట్లపాలెం దగ్గరకు వచ్చే సరికి ముందున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. వెనక్కి తప్పించబోయి పక్కనున్న మరో కారును ఢీకొని ఆగకుండా వెళ్లిపోయాడు. ఇది గమనించిన తోటి వాహన చోదకులు కారును వెంబడించడంతో అక్కయ్యపాలెం నరసింహనగర్ దగ్గర మరికొన్ని వాహనాలను ఢీకొట్టి కారు ఆగిపోయింది. వారంతా ఆ వ్యక్తిని పట్టుకుని నాలుగో పట్టణ పోలీసులు అప్పగించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ఉచితంగా జవాన్ సినిమా ప్రదర్శన



మధురవాడ సినీ థియేటర్‌లో విద్యార్థులతో విక్రాంత్ హనుమంతు తదితరులు

సీతంపేట: పాఠశాలల విద్యార్థుల్లో చిరునవ్వులు, వినోదం పంచాలనే సదుద్దేశంతో సినీపోలీస్‌తో కలిసి ఒకే రోజు పది వేల మంది విద్యార్థులకు జవాన్ సినిమా చూపిస్తున్నామని రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా చైర్మన్ విక్రాంత్ హనుమంతు తెలిపారు. ద్వారకానగర్ శ్రీకృష్ణ విద్యామందిర్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి ప్రతి ఏటా విద్యార్థులకు వినోదం పంచుతున్నామని, గతేడాది 6500 మందికి సినిమా చూపించామని చెప్పారు. ఈ ఏడాది సోమవారం దేశవ్యాప్తంగా 38 నగరాల్లోని 51 థియేటర్లలో 10 వేల మంది విద్యార్థులకు సినీపోలీస్ స్క్రీన్స్‌పై జవాన్ సినిమా ప్రదర్శిస్తున్నట్టు పేర్కొన్నారు. సినిమా విరామ సమయంలో పాప్‌కార్న్, కూల్ డ్రింక్ ఇస్తామని, ప్రతి విద్యార్థి కోసం సుమారు రూ.500 చొప్పున రూ.50 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. విశాఖలో 400 మంది పిల్లలకు జవాన్ సినిమా చూపించామన్నారు. రౌండ్ టేబుల్ ఇండియా గత 22 ఏళ్లలో 3,616 ప్రాజెక్టుల్లో 8,665 తరగతి గదులు నిర్మించి, 9.53 మిలియన్లకుపైగా పేద పిల్లల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. అనంతరం శ్రీకృష్ణ విద్యామందిర్ విద్యార్థులను బస్సులో మధురవాడలోని సినీపోలీస్ థియేటర్‌కు తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆర్‌టీఐ వైస్ చైర్మన్ మసూద్ అహ్మద్, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై కూలిన భారీ వృక్షం

- యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు



ఎన్‌జీవోస్ కాలనీలో విద్యుత్ పోల్‌పై పడిన భారీ వృక్షం

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం ఎన్‌జీవోస్ కాలనీలో హైటెన్షన్ లైన్స్ ప్రవహిస్తున్న విద్యుత్ పోల్‌పై భారీ వృక్షం కూలింది. ఈ ఘటనలో స్తంభం విరిగి, విద్యుత్ వైర్లు తెగిపోయి ఈ ప్రాంత పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న ఏపీఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన విద్యుత్ పోల్, వైర్ల పనులు చేపట్టి రాత్రి 7 గంటలకు సరఫరాను పునరుద్ధరించగలిగారు. ఈ పనులను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.విద్యాసాగర్, అసిస్టెంట్ ఇంజినీర్ జి.హరగోపినాథ్‌ల పర్యవేక్షణలో సిబ్బంది పూర్తి చేశారు.

రైళ్లలో పేలుడు పదార్థాల రవాణా నేరం



తాటిచెట్లపాలెం: ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించేటపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పేలుడు, మండే స్వభావం గల పదార్థాలను తమతో తీసుకువెళ్లరాదని, ఇది ప్రమాదకరమని, శిక్షార్హమైన నేరమని వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టపాసులు, గ్యాస్ సిలిండర్స్, ఏసిడ్, కిరోసిన్, పెట్రోల్ వంటి వాటిని రైళ్లలో, రైల్వే స్టేషన్లలోనికి తీసుకురావడం రైల్వే యాక్ట్ 1998 ప్రకారం నేరమని, ఇలా చేసిన వారికి మూడేళ్ల వరకు జైలు, జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. దీపావళి సమీపిస్తున్న తరుణంలో వాల్తేర్ డివిజన్ వీటికి సంబంధించి ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీరితో పాటు సివిల్ డిఫెన్స్ సభ్యులు, టీటీఈలు, కోచ్ అటెండెంట్స్, ట్రైన్ మేనేజర్స్, స్టేషన్ మేనేజర్లు కూడా తరచూ తనిఖీలు చేపడతారన్నారు. ప్రయాణికుల సహాయం కోసం 139 నంబర్‌ను సంప్రదించాలని త్రిపాఠి కోరారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

- బెంగళూరులో మంగళవారం ఉదయం 10.15 గంటలకు బయల్దేర వలసిన బెంగళూరు–అగర్తలా(12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ 24 గంటలు ఆలస్యంగా బుధవారం ఉదయం 10.15 గంటలకు బయల్దేరుతుంది.
- అలెప్పిలో మంగళవారం ఉదయం 6 గంటలకు బయల్దేరాల్సిన అలెప్పి–ధన్‌బాద్ (13352) బొకారో ఎక్స్‌ప్రెస్ సుమారు 5 గంటలు ఆలస్యంగా ఉదయం 10.45 గంటలకు బయల్దేరుతుంది.

ప్రయాణికుల కోసం స్పెషల్ రైళ్లు

ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్ – కటక్ – హైదరాబాద్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- హైదరాబాద్ – కటక్ (07165) స్పెషల్ హైదరాబాద్‌లో ఈ నెల 7, 14, 21న (ప్రతీ మంగళవారం) రాత్రి 8.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.07 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కటక్ – హైదరాబాద్ (07166) స్పెషల్ కటక్‌లో ఈ నెల 8, 15, 22న (ప్రతీ బుధవారం) రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 7.37 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.
- ప్రయాణికుల సౌకర్యార్థం పూర్తి జనరల్ కోచ్‌లతో కూడిన ఎర్నాకుళం ధన్‌బాద్ (06077) స్పెషల్ రైలు ఈ నెల 10న రాత్రి 11.55 గంటలకు ఎర్నాకుళంలో బయల్దేరి ఆదివారం తెల్లవారుజామున 1.45 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 1.50 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 11 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ఈ రైలు 22 జనరల్, 2 లగేజీ కం సెకండ్ క్లాస్ కోచ్‌లతో నడుస్తుంది.
- ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు – న్యూ భువనేశ్వర్ – బెంగళూరు మధ్య జన సాధారణ్ స్పెషల్ రైలు నడుపుతున్నారు.
- బెంగళూర్ – న్యూ భువనేశ్వర్ (06287) స్పెషల్ ఈ నెల 10న బెంగళూరులో తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 10.38 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 10.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు న్యూ భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో న్యూ భువనేశ్వర్ – బెంగళూరు (06288) స్పెషల్ శనివారం ఉదయం 8.15 గంటలకు న్యూ భువనేశ్వర్‌లో బయల్దేరి అదేరోజు సాయంత్రం 4.15 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 4.17 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ విషయాలను ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

మరోసారి సేవ చేసే అవకాశం



జాన్‌వెస్లీని అభినందిస్తున్న క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రతినిధులు

సీతంపేట: ఏపీ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా రెండో సారి పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీని క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల క్రిస్టియన్ మైనార్టీ ఫోరం నాయకుడు శామ్యూల్ అరుణ్ కుమార్ కలిసి ప్రార్థనలు చేసి దైవ ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తనపై ఉన్న అపారమైన నమ్మకంతో మళ్లీ క్రైస్తవ సమాజానికి సేవ చేసే భాగ్యం కల్పించారన్నారు. కార్యక్రమంలో రెవరెండ్ డాక్టర్ మిస్సాల మోజెస్ ఎలీషా, అహతరోన్ రాజ్, ప్రవీణ్, రెవరెండ్ కాకర సత్య మనోహర్, జేఎఫ్‌సీ ఫెలోషిప్ విశాఖపట్నం నాయకులు పాల్గొన్నారు.


రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



యువకుడి మృతదేహం

తాటిచెట్లపాలెం: రైలు నుంచి జారిపడి ఆదివారం గుర్తు తెలియని ఒక యువకుడు మృతి చెందినట్లు విశాఖ గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలిలా.. సుమారు 25 ఏళ్ల వయసున్న యువకుడు మర్రిపాలెం నుంచి విశాఖ రైల్వే స్టేషన్‌కు వస్తున్న మార్గంలో రైలు నుంచి జారిపడి చనిపోయాడు. ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. కడుపు మీద కుడిచేతి వైపు పుట్టుమచ్చ ఉంది. చామనచాయ, సుమారు 5.6 అడుగుల ఎత్తు ఉన్నాడు. మరణించిన యువకుడు బ్లూ టీ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నారు. కుడిచేతికి కడియం, మెడలో నల్లపూసల దండ ఉంది. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజనాయుడు ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీకి గానీ లేదా 94406 27547, 79892 94775 నంబర్లలో తెలియజేయాలని పోలీసులు కోరారు.

విద్యార్థులకు కోడిగుడ్ల పంపిణీ



సీతంపేట పాఠశాలలో విద్యార్థులకు బాయిల్డ్ ఎగ్స్ అందిస్తున్న నెక్ జోనల్ వీసీ రామకృష్ణారెడ్డి

మహారాణిపేట: నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ(నెక్) వ్యవస్థాపకుడు డాక్టర్ బి.వి.రావు 88వ జయంతి సందర్భంగా సోమవారం పలు ప్రాంతాల్లో కోడిగుడ్లు పంపిణీ చేశారు. సీతంపేట ప్రాథమిక పాఠశాలలో నెక్ జోనల్ వైస్ చైర్మన్ ఎస్.రామకృష్ణారెడ్డి, నెక్ కార్యవర్గ సభ్యుడు బి.రామారావు, మెడికల్ రిప్రజెంటేటివ్ ఎం.వి.అరవింద్ తదితరులు విద్యార్థులకు బాయిల్డ్ ఎగ్స్ అందజేశారు. సబ్బవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నెక్ జోనల్ చైర్మన్ టి.యు.భాస్కర్ బాయిల్డ్ ఎగ్స్ పంపిణీ చేశారు. పరవాడ ఎంపీపీ హైస్కూల్‌లో విద్యార్థులకు నెక్ కమిటీ నాయకులు కె.గంగి రెడ్డి, ఎం.శివరామకృష్ణ, టి.శ్రీధర్, ఎం.సాంబశివరావు తదితరులు కోడిగుడ్లు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఈసీ సభ్యుడు బి.రామారావు, ఏపీ పౌల్ట్రీ సమాఖ్య నార్త్ ఆంధ్రా రీజినల్ చైర్మన్ బి.సాయినాధరావు, ఇతర ప్రముఖులు పి.శేషగిరిరావు, జి.అప్పారావు, జి.దుర్గారావు, బి.శరత్, బి.శ్రీనివాస్, ఎ.శివప్రసాద్, బి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.